# విచిత్ర వివాహం

నా అంతటి నేను మా అబ్బాయి కటువంటి పెళ్ళిచేసి ఉండను. ఆ పెటకం మీ రామమూర్తే పెట్టాడు. వాడు తప్ప మరెవ్వడు చెప్పినా అటువంటి ఆలోచనకు అంగీకరించి ఉండేవాణ్ణికాను కూడానూ.

ఈ ఉత్తరం తిలకించండి.

"నాగపూరు. 5 జూలై 1924.

"ప్రియ మిత్రమా, (ఉత్తరం ఇంగ్లీషులో) 3 వ తేదీన నువ్వు రాసిన ఉత్తరం నన్ను చాలా ఆందోళన పెట్టింది. మీ అబ్బాయి పెళ్ళి విషయం ఆలోచిస్తున్నానన్న వాడవు మా అమ్మాయి విషయం ఎందుకు అడిగావు కావు? నేను నిన్నిందుకు క్షమించను— ఒక షరతుమీద తప్ప. అదేమిటంటే నువ్వు మీ అబ్బాయికీ మా అమ్మాయికీ వివాహం చెయ్యాలి. అది కూడా నేను చెప్పేతీరుగా,

మా పెద్దదాని పెళ్ళితో నాకు పెళ్ళంటే హడలిపోయింది. నీకు కూడా అటువంటి భయమే కలిగి ఉండేది నా పెద్దపిల్ల మీద నీకు తగినంత కటాక్షం ఉండి ఉంటే.

'మనిద్దరికీ భగవంతుడు కొంతబుద్ధి ప్రసాదించాడు. బుద్ధిగలమనిషి కొక్క అనుభవం. నా అనుభవం నీదికాదా? నువ్వుకూడా నేనుపడ్డగోతులో పడాలా? మంత్రాలబలిమియందు నాకు నమ్మకం వచ్చింది. నీకింకా చావలేదా? భార్యాభర్తల ఇష్టాయిష్టాలతో ఏమీ సంబంధం లేకుండా ఆజన్మాంతం ఇద్దర్నీ ఒకరికొకర్ని అంటగట్టడం పాపంగా తోచటంలేదా నీకింకా! ఊరికేతోచి ఏంప్రయోజనం? ఆచరణలోకి ఎప్పుడొస్తుంది! కీకారణ్యంగా ఉన్న ఈ సంఘ చట్టాన్ని ఒక చెంపనించి బాగుచేసుకుంటూ ఎందుకు రాగూడదు మనం! ఎప్పటి కైనా నందనవనం అవుతుందేమో.

'మనపిల్లలకు కొత్తరకం వివాహంచేద్దాం. ఎందుకు చెయ్యకూడదు! ఆ వివాహాన్ని గురించి వివరాలు తరవాత రాస్తాను. ముందు ప్రస్తుత వివాహ చట్టంలో ఉన్న లోపాలేమిటో గమనించి వాటిని మనం సరిచేసుకుందాం.

'నీకూ నాకూ ఇప్పుడు ప్రేమలో నమ్మకంలేదు. మనకు చిన్నతనంలోలేదా? అప్పుడు మనమనస్సుకు తృప్తిజరిగిందా? లేదు. ఎందువల్ల? మనం చేసుకో వలసిన పనులన్నీ ఎవరోచేశారు. మనమూ మనభార్యలూ ఇంకోరి సహాయం లేకుండా కలుసుకుంటే ఎంత ఆనందంగా ఉండేది? ఊహించుకో.

'తరవాత మనసంసారాలు చూడు. భార్యాభర్తలకు మొదట్లో పరస్పరా కర్షణ ఉన్నా, అది సాంతంగా పొయ్యేదాకా, ఒకరిమీద ఒకరికి అసహ్యంపుట్టే దాకా, చక్కగా సుఖమయంగా ఉండవలసిన సంసారం కుళ్ళుగుంట అయేదాకా భార్యాభర్తలు ఒకర్నిగురించొకరు తెలుసుకోగూడని విషయాలన్నీ తెలుసు కుంటారు. ఆపైనేముంది? కొంచెం ధురిగల ఆడదిగాని మగవాడుకాని అయితే సంఘచట్టాలన్నిటికీ తిరగబడటం, అతిక్రమించటం, అపఖ్యాతి, లేకపోతే ఈ మురికిగుంటలోనే మునగానాం తేలానాం.

'ఆమీద మగవాడు ఆడదానికందకుండా సృష్టికావటం. పిల్లలు ఈ ఇద్దరిమధ్యా ఊగుతూండటం ఎవరో చెప్పినట్టు ఆడవాళ్ళ సంఘంలో చీట్లపేకలో పొడిముక్కలల్లే ఉన్నారు. వాళ్ళేవిధంగా అభివృద్ధి పొందటానికీ అవకాశంలేదు. ఇంకోసంగతిచూడు. అశక్తులూ ఉన్న మగవాడికి ఆస్తిలో భాగమేమిటి? అసలు మగవాడికన్న ఆడదానికి అనేకరెట్లు డబ్బు అవసరం. పిల్లలను ఎవరికైనా కననీ కాక ఏ ఆడదానిపిల్లలు ఆ ఆడదానిపోషణలోనే ఉండటం సహజం. నా పెద్దమ్మాయి కొద్దికాలంలో ఉద్యోగంలో ప్రవేశించబోతున్నది. మా చిన్నదాన్ని పెద్దచదువు చదివిస్తాను. అది నెలకు నూరూ నూటయాభై సంపాదిస్తే కాని నాకు తృప్తి ఉండదు. నా స్వార్జితం ఇద్దరికీ పంచేస్తాను.

'మరోవిషయం మనిద్దరం ఒకరిమాటలు ఒకరు ఎట్లా అర్థంచేసుకుంటామో, నాపిల్ల మీ అబ్బాయిని అట్లా అర్థంచేసుకుంటుందని గ్యారంటీ ఇస్తున్నాను. నాపిల్ల మీవాడినెత్తిన బరువల్లే ఉండదు. దాని నైతిక బాధ్యతలూ ఆర్థికబాధ్యతలూ మీవాడినెత్తిన వెయ్యదు. ఇద్దరికీ ఎప్పుడభ్యంతరమైతే అప్పుడు విడిపోవచ్చును. ఒకర్నిగురించి ఒకరు అవసరమైనదానికన్న ఎక్కువ తెలుసుకోనక్కర్లేదు. నిజంగా మన అనుభవంలోకి ఎన్నడూరాని ప్రేమే వాళ్ళకు కలగటమే జరిగి, సామాన్యమానవులల్లేకాక, వాళ్ళు ఒకరి దౌర్బల్యమందు ఒకళ్ళ సానుభూతే చూపగలిగితే వాళ్ళిద్దర్నీ భగవంతుడు కూడా ఎడబాపలేడు కదా. ఆలోచించు.'

'ముఖ్యమైన విషయం. ఇది చట్టంగాచేసి లోకానికి ఇవ్వకుమా. ఎంత మంచి చట్టమయినాసరే, అవివేకుల చేతుల్లో విషంగా మారుతుంది. లేకపోతే ఇప్పుడమల్లో ఉన్న చట్టాలన్నీ సంఘానికి పీడకలిగించాలని ఉద్దేశించబడ్డవా?'

'ప్రత్యక్షంగా అంతా మాట్లాడతాను, నీక్షేమం....'

రామమూర్తిమీద నాకు గురేనసండి, నాకు వాడివాదన సమంజసంగా తోపటంవేతనే కానివ్వండి నేను వాడి ఏర్పాట్లన్నీ అంగీకరించాను. అప్పటికి మా అబ్బాయికి పదిహేడేళ్ళు. రామమూర్తికూతురు పదమూడేళ్ళది. మరి మూడు సంవత్సరాలదాకా మేమేమీ చెయ్యదలచలేదు.

1927 మార్చిలో రామమూర్తి మా ఇంటిపక్క స్థలం వెయ్యిగజాలుకొని ఇల్లుకట్టాడు. అది తన చిన్నకూతురి కోసమే.

నేను మా అబ్బాయితోకాని రామమూర్తి తన పిల్లతోకాని ఏమీ చెప్పలేదు.

ఆ డిశంబరులో రామమూర్తి ఇద్దరు పిల్లలనూ తీసుకుని (భార్య రెండోపిల్ల పురుటల్లోపోయింది.) కొత్త ఇంట్లో ప్రవేశించాడు. 'మూడునెలల శలవుమీద వచ్చాను. అంతదాకా ఉండిపోతాను. ఈలోపుగా ఏం కానుందో చూదాం.' అన్నాడు రామమూర్తి. నేను సరేనన్నాను. మావాడప్పటికి బి.ఏ. పూర్తిచేసి ఇంటి దగ్గరే ఉంటున్నాడు.

రామమూర్తి రెండోకూతురు అందమైన పిల్లె. చాలా చొరవగలది కూడాను పేరు అలివేణి. మావాడికీ దానికీ స్నేహమయిందంటే వీడుకాదు కారణం. రామమూర్తి పెద్దకుమార్తె సామాన్యంగా ఇల్లుకదిలేదికాదు.

రామమూర్తి తనతెలివంతా వినియోగించి మా పిల్లలిద్దరికీ బాగా పరిచయం గలిగే అవకాశాలన్నీ ఇచ్చాడు. సినిమాలకూ నాటకాలకూ మావాడివెంట అలివేణిని పంపిస్తూండేవాడు. మావాడు వాళ్ళింటికి సామాన్యంగా వాళ్ళింటికొచ్చే వేళప్పుడు తను ఇంట్లో ఉండేవాడుకాదు. పెదపిల్ల ఇంట్లో ఉన్నాలేనట్టే.

వీళ్ళకిటువంటి స్వేచ్ఛ ఇవ్వటం అపాయకరమేమో అనిపించేది మధ్యమధ్య నాకు. సాంప్రదాయం ఎక్కడికిపోతుంది?

కాలం గడిచినకొద్దీ ఈస్నేహం మేం చూస్తుండగానే పెరిగిపోయింది. అలివేణి అస్తమానం మావాడితో ఏదో రహస్యాలోచన చేస్తున్నట్టు గ్రహించాను. నాకర్థంకాలేదు. రామమూర్తితో చెబితే తనకర్థమైనట్టు సూచించాడు.

ఎందువల్లో నాకు రోజులు గడుస్తున్నకొద్దీ ధైర్యం తగ్గటం మొదలు పెట్టింది. మొత్తానికి రామమూర్తి మొండిఘటం.

ఒకరోజు నేను దీపాలు పెట్టిన తరవాత ఇంటికొస్తూ బజారులో ఒక బండిలో మావాడు అలివేణితో బండీ ఎక్కిపోతూండటం చూశాను. బండిలో ఇద్దరూ కాక పెట్టె కూడా ఒకటుంది, నా కనుమానం కలిగింది. ఏ పూర్తైనా లేచిపోతున్నారా? ఎందుకు?

ఈ విషయమేమిటో కనుక్కుందామని నేను కూడా స్టేషనువైపున నడవటం మొదలుపెట్టాను. ఆ ఇద్దరూ అక్కడికి చేరుకున్నారన్నమాట. వాళ్ళెక్కినబండి స్టేషనుదగ్గిర కనిపించింది. నేను మెల్లిగా లోపలికిపోయి అటూ ఇటూ చూడటం మొదలుపెట్టాను వీళ్ళకోసం. ఆ గుంపులో ఇద్దరూ కనపడ్డారు. మావాడిచేతులో పెట్టె ఉంది. అలివేణిచేతులో రొండు టిక్కట్లున్నై. ఇద్దరూ బయటికిపోతున్నారు ప్లాటుఫారంమీదికి. ఇంతలో బండికూడా వచ్చింది.

నేను కూడా ప్లాటుఫారం టిక్కెట్టుకోసం కిటికీ దగ్గిరికిపోతే అప్పుడే బుకింగాఫీసరుగారు ఎక్కడికో నిష్క్రమించాడు. ఆయనకోసం కేకలుపెట్టి ఎట్లాగైతేఏం ఆయనతో ఘర్షణచేసి టిక్కెట్టు తీసుకుని నేను కూడా ప్లాటుఫారం మీదికి పొయ్యేటప్పటికి రైలు సాగింది. నేనొక్క అరనిమిషంసేపు దానివంక చూసి నిట్టూర్పువిడిచి వెనక్కు తిరిగేటప్పటికి 'నాన్నా!' అని పిలుపు వినబడ్డది. మావాడు, నాకేమీ అర్థంకాలేదు.

'నువ్వు కూడా పోలేదేంరా?' అన్నాను.

మావాడాశ్చర్యంతో 'ఎక్కడికి?' అన్నాడు.

నాకుమాత్రం ఏంతెలుసు?

'అలివేణి ఏది!' అన్నాను.

మావాడునవ్వి 'నీకెట్లా తెలిసింది?' అన్నాడు.

'ఏది అలివేణి?'

'నాగపూరు పోయింది.'

నా కసలర్థంకాలేదు.

'ఎందుకు'

పెళ్ళిచేసుకోటానికి అక్కడ ఎవడో ఉన్నాట్ట. వాడిదగ్గిర్నించి ఉత్తరాలొచ్చేవి ఆ అమ్మాయికి. అంతా నాకు చెప్పింది. వాళ్ళనాన్నకు చెప్పటానికి భయంట. సరే నా చాతయిన సహాయం నే చేశాను.

నేనేమీ మాట్లాడలేదు. ఏముంది మాట్లాడటానికి.

(ప్రథమ ముద్రణ : అక్టోబరు 1935, ఆంధ్రభూమి)